
సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 3 । ఏప్రిల్ । 2024



పీజీ ప్రవేశాలకు..

పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. మే 4 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.


- 8లో



మొబైల్ ఫోన్ల అందజేత

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. బాధితులకు అందించారు.

- 8లో



న్యూస్‌రీల్

4 నుంచి ఒంటిపూట అంగన్‌వాడీ కేంద్రాలు

శ్రీకాకుళం అర్బన్: స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకూ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలూ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే పని చేస్తాయని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ తెలిపారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా అంగన్‌వాడీ కేంద్రాల పనివేళల్లో మార్పులు చేసినట్లు తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంటికి పంపిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తగినంత తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు నిర్దేశిత వేసవి సెలవులను కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. మే నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ అంగన్‌వాడీ కార్యకర్తలకు, మే నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ అంగన్‌వాడీ హెల్పర్లకు వేసవి సెలవులను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

'మద్యం అక్రమ రవాణా నిరోధించాలి'



మాట్లాడుతున్న సెబ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

శ్రీకాకుళం క్రైమ్ : మద్యం, సారాయి, గంజా ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా నిరోధించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విశాఖపట్నం డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి జిల్లాలోని సంబంధిత విభాగ సీఐలను ఆదేశించారు. ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట సమీపంలో ఉన్న శ్రీకాకుళం సెబ్ స్టేషన్‌లో మంగళవారం సెబ్ జేడీ (అదనపు ఎస్పీ) గంగాధరం అధ్యక్షతన జిల్లాలో ఉన్న సీఐలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని ఆపి తనిఖీ చేయాలని, ఏఓబీ ప్రాంతాల్లో ఎన్‌డీపీఎల్ రాకుండా చూడాలని, ఎక్కడా ఎలాంటి అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు.

● రేటు కట్టి.. టికెట్లు అమ్మకానికి పెట్టి

దేశంలో ధనస్వామ్యం



చంద్రబాబుకు రూ.10కోట్లు, లోకేష్‌కు రూ.10కోట్లు, అచ్చెన్నాయుడికి రూ.7కోట్లు, కూన రవికుమార్‌కి రూ.3కోట్లు ఇచ్చానని టిక్కెట్ సాధించిన వ్యక్తే చెబుతున్నాడని మీడియా ముందు టీడీపీ నాయకులు ఆరోపించారు. శ్రీకాకుళం టికెట్ రూ.30కోట్లుకు అమ్మేసిన చంద్రబాబు ఈ రాష్ట్రాన్ని ఏం బాగు చేస్తాడు. - నడిరోడ్డు మీద శ్రీకాకుళం టీడీపీ నాయకులు ఆవేదనతో అన్న మాటలివి.

టీడీపీ అధిష్టానం రూ. 20కోట్లకు పాతపట్నం టికెట్ అమ్మేసింది. పనికిమాలిన వాడికి టిక్కెట్ ఇచ్చేశారు. ఈ విషయంలో కూన రవికుమార్ జిల్లా అధ్యక్షుడిగా వాస్తవాలను చెప్పాల్సింది పోయి డబ్బులు తీసుకుని అబ్జర్వర్‌ను, రాబిన్‌శర్మ టీమ్‌ను మేనేజ్ చేసి, రిపోర్టులు తారుమారు చేసి ఒక ఫోర్ ట్వంటీకి టిక్కెట్ ఇప్పించారు. కూన రవికుమార్ నంబర్ వన్ దొంగ. ఆయన మా పక్కనే ఉన్నాడు. ఎన్నికల్లో మా సత్తా ఏంటో చూపిస్తాం.

- పాతపట్నం టీడీపీ నాయకులు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలివి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :


టీడీపీ శ్రేణుల్లో వారం పది రోజులుగా వీటిపై చర్చలు నడుస్తున్నాయి. కులాభిమానంతో పాటు డబ్బులు ఇచ్చిన వారికే టీడీపీ అధిష్టానం టికెట్లు ఇచ్చిందని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. పోటీ తీవ్రంగా ఉన్న నరసన్నపేట, పలాస టిక్కెట్లను సైతం కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ఆ పార్టీ వర్గాలే కోడై కూస్తున్నాయి. రేటు కోసమే చివరి వరకు టికెట్ ప్రకటించకుండా కాలయాపన చేశారన్న విమర్శలు ఉన్నాయి. మొత్తానికి టికెట్లను అంగడి సరుకులా అమ్మేశారన్నది స్పష్టమైంది. టికెట్ కోసం టీడీపీలో డబ్బులు తీసుకుంటారన్నది ఎప్పుడూ వినబడేదే.

కానీ ఈ సారి చంద్రబాబు బరితెగించేశారు. తనకిదే చివరిదనుకున్నారో మరేంటో గానీ ఒక్కో టికెట్‌ను రూ.20 కోట్ల నుంచి రూ. 30కోట్లు వరకు అమ్ముకున్నారని ఆ పార్టీ నాయకులే రోడ్డెక్కి లోగుట్టు విప్పారు. దీంతో డబ్బుల్లేని రాజకీయ నాయకులంతా వెనక్కి తగ్గిపోయి... ఉన్న ఫలంగా కోట్లకు పడగెత్తిన నాయకులు రేసులోకి వచ్చారు. వారిలో కూడా పోటీ పెట్టి, బేరసారాలు చేసి వారిలో ఎవరైతే ఎక్కువ ఇచ్చారో వారికే టికెట్ ఖరారు చేశారన్నది స్పష్టంగా తెలిసింది. ఎక్కడైతే పోటీ ఎక్కువగా ఉందో అక్కడ సుదీర్ఘ సంప్రదింపులు చేసి, బేరం ఎక్కువ కుదిరిన తర్వాత సీట్లు ప్రకటించినట్టుగా ఆ పార్టీ వర్గాలు బహిరంగంగా చెబుతున్నాయి.

డబ్బుకే పెద్దపీట

పార్టీలో సీనియారిటీ, సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వకుండా డబ్బుకే చంద్రబాబు పెద్ద పీట వేశారు. ఎవరైతే ఎక్కువ ఇవ్వగలరో, ఎవరైతే ఎన్నికల్లో ఖర్చు పెట్టగలరో తెలుసుకుని టికెట్లు ఇచ్చారన్నది స్పష్టమవుతోంది. జిల్లాలో శ్రీకాకుళం, పాత పట్నం, ఎచ్చెర్ల సీట్లకు ఎక్కువ ధర పలికినట్టు తెలుస్తోంది. మిత్రపక్షంగా ఉన్న బీజేపీలో కూడా ఎవరికి సీటు ఇవ్వాలో నిర్ణయించేది కూడా చంద్రబాబే అని, పెద్ద ఎత్తున తమ సీట్లు అమ్ముడు పోయాయని నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి ఆరోపణలు చేశారు. ఇక్కడ వ్యవహారం విశాఖ వరకు, అక్కడి నుంచి విజయవాడ వరకు పాకిందంటే ఏ స్థాయిలో లావాదేవీలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

- టీడీపీలో విచిత్ర పరిస్థితి
- రూ.20 కోట్ల నుంచి రూ. 30కోట్లకు టికెట్ అమ్ముకున్నారంటూ ఆగ్రహిస్తున్న టీడీపీ నాయకులు
- చంద్రబాబు, లోకేష్‌తో పాటు అచ్చెన్న, కూన రవి, రామ్మోహన్‌పైన ఆరోపణలు
- ఎన్నికల ఖర్చుపై అభ్యర్థుల ఆందోళన
- ఆస్తుల తాకట్టు, బ్యాంకు రుణాల కోసం యత్నాలు
- డబ్బు లేదని తెలిస్తే మార్చేస్తారని భయం



ఎన్నికల్లో ఇంకెంత ఖర్చు పెడతారో

కేవలం సీటు కోసమే రూ.20 కోట్ల నుంచి రూ.30కోట్లు ఖర్చుపెట్టారంటే ఎన్నికల్లో ఆ అభ్యర్థులు ఇంకెంత ఖర్చు పెడతారో అన్న చర్చ మొదలైంది. సీటు ఖరారు కానంతవరకు పార్టీ కోసం కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. సీటును అంతకుమించి కొనుగోలు చేశారు. ఎన్నికల్లో దానికి మించి ఖర్చు పెడితే తప్ప నిలబడలేరనే వాదన టీడీపీలోనే ఉంది. దానికోసమే కోట్లు పెట్టి టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు తదుపరి ఖర్చు కోసం రుణాల కోసం బ్యాంకులను, ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్నట్టుగా కూడా తెలిసింది. తమకున్న ఆస్తులను తాకట్టు పెట్టి కోట్ల రూపాయలను తెచ్చుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయం కూడా ఆ పార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. చంద్రబాబును చివరి వరకు నమ్మలేమని, ఏ క్షణంలో ఏ నిర్ణయం తీసుకుంటారో తెలీదని, డబ్బుల్లేవని తెలిస్తే టికెట్ ఉండదని అభ్యర్థులు భయపడుతున్నారు. అందుకనే టికెట్ ఆశించి భంగపడ్డ అభ్యర్థులు ఇంకా వేచి చూసే ధోరణిలో ఉన్నారు. బీఫారాలు ఇచ్చినంతవరకు ఇప్పుడున్న వారే అభ్యర్థులుగా ఉంటారనుకోవడం తప్పు అని, ఇలాంటి పరిణామాలు గతంలో ఎన్నో చూశామని, ఆ అనుభవంతోనే టిక్కెట్ రాని వారంతా ఏదైనా జరగొచ్చనే ఆశతో చూస్తున్నారు. లాబీయింగ్ చేస్తూనే అధిష్టానానికి బెదిరింపుల సంకేతాలు పంపిస్తున్నారు. ఇలాంటి అవకాశాలకు తావివ్వకూడదనే అభ్యర్థులు డబ్బుల వేటలో ఉన్నారు. అధిష్టానం ఆశించిన మేర ఖర్చు పెట్టేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎలుగును పట్టుకోవడంతో ఊపిరి పీల్చుకున్న ప్రజలు (ఇన్‌సెట్లో) బోనులో బంధించిన ఎలుగు





ఆపరేషన్ భల్లూకం

- పది గంటల పాటు సాగిన ఉత్కంఠ
- ఎట్టకేలకు ఎలుగు పట్టివేత
- ఊపిరి పీల్చుకున్న ఉద్దానం ప్రజలు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దానం పల్లె ఊపిరి పీల్చుకుంది. దాదాపు పది గంటల సేపు ప్రాణాలను అరచేతిలో పట్టుకుని గడిపిన ఆ ఊరు భల్లూకం దొరకడంతో హమ్మయ్య అనుకుంది. మండలంలోని మెట్టూరు గ్రామంలో ఓ భల్లూకం కలకలం రేపింది. సోమవారం రాత్రి గ్రామంలో సంచరిస్తూ పాడుబడిన ఇంటిలోకి ప్రవేశించింది. దీన్ని చూసిన స్థానికులు వణికిపోయారు. అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేయడంతో అధికారులు మంగళవారం ఉదయం జిల్లా అటవీశాఖాధికారి నిషా కుమారి సమక్షంలో ఆపరేషన్ భల్లూకం మొదలుపెట్టారు. ఇంటి చుట్టూ వలలు ఏర్పాటు చేసి ఇంటి ముందు బోను పెట్టారు. ఎలుగును బంధించేందుకు మత్తు వైద్యులు సైతం రెడీ అయ్యారు. కానీ భల్లూకం మాత్రం ఇంటి నుంచి బయటకు రాలేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎలుగు బయటకు వచ్చేందుకు తేనె, జీడి పండ్లను పెట్టినా ఫలితం లేకపోయింది. ఆఖరికి స్థానిక యువకులు ఆ ఇంటిపైకి ఎక్కి కర్రలతో రేకుపై శబ్దం చేయడంతో ఎలుగు భయపడి బయటకు వచ్చి అక్కడ ఏర్పాటు చేసిన బోనులో చిక్కుకుంది. సుమారు 50 మంది అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులు దాదాపుగా 10 గంటల పాటు శ్రమించారు. ఎలుగును ప్రత్యేక వాహనంలో విశాఖపట్నంలో గల ఇందిరా గాంధీ జంతుశాలకు తరలించినట్లు అధికారులు తెలియజేశారు. ఈ ఆపరేషన్‌లో మత్తు ఇచ్చే వైద్యులు పురుషోత్తం, రేంజర్ మురళీకృష్ణం నాయుడు తదితరులు ఉన్నారు. ఇటీవల ఎలుగుబంట్లు గ్రామాల్లోకి వచ్చేస్తుండడంతో ఉద్దానం వాసులకు తోటలకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

నియంత్రణ చర్యలు చేపడతాం



ఎలుగులు క్రూరమైన జంతువులు. వాటితో కవ్వింపు చర్యలకు పాల్పడకూడదు. ఎలుగుల సంచార నియంత్రణ చర్యలు చేపడతాం. ప్రస్తుతం ఇంటిలోకి ప్రవేశించిన ఎలుగును అందరి సహకారంతో పట్టుకోగలిగాం. విశాఖపట్నం జూకు తరలిస్తాం.

- నిషా కుమారి, జిల్లా అటవీశాఖాధికారి, శ్రీకాకుళం

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ మంగళవారం పరిశీలించారు. కళాశాల క్యాంపస్‌లో పార్కింగ్, అనుబంధ రోడ్లు, స్ట్రాంగ్ రూమ్ భద్రత వంటి అంశాలపై ఎస్పీ జీఆర్ రాధిక, జేసీ ఎం.నవీన్‌లతో కూడిన అధికారులతో చర్చించారు. స్ట్రాంగ్ రూంలకు పూర్తిస్థాయి భద్రత, సీసీ కెమెరాలు ఏర్పాటు, 24 గంటలు అంతరాయం లేని విద్యుత్ సరఫరా వంటి అంశాలను పరిశీలించారు. పోలింగ్ పూర్తయ్యాక ఒక్కసారిగా వాహనాలు చేరుకునే అవకాశం ఉండటంతో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పార్కింగ్ వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, ఆర్‌డీఓ సీహెచ్ గంగయ్య, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్‌తో కూడిన అధికారులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్పీ రాధిక, అధికారులు

రూ.3లక్షల నగదు పట్టివేత

జలుమూరు: బిల్లులు లేకుండా తరలిస్తోన్న రూ.3,01,400 నగదును టెక్కలిపాడు జంక్షన్ వద్ద మంగళవారం స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తిరుపతిరావు తెలిపారు. చల్లవానిపేట నుంచి నరసన్నపేటకు బైక్‌పై వెళ్తున్న నరసన్నపేట మండలం జమ్ము పంచాయతీ పొన్నాడపేటకు గ్రామానికి చెందిన పొన్నాన రామారావు నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని హెచ్‌సీ పురుషోత్తం తెలిపారు. చల్లవానిపేట నుంచి ఈ డబ్బులు తెచ్చినట్లు వివరించారని బిల్లునకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకొని తహసీల్దార్ నాగమ్మ ముందు హాజరు పరిచినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తెలిపారు.



తహసీల్దార్ నాగమ్మకు కేసు వివరాలు అందిస్తోన్న అధికారి తిరుపతిరావు



వలంటీర్లపై తొలి నుంచీ

పచ్చ పగ


- నిస్సహాయులపై టీడీపీ పెత్తందారుల అక్కసు
- వ్యతిరేకత వెల్లువెత్తుతుండటంతో చంద్రబాబు యూటర్న్
- చేసిన తప్పును కప్పిపుచ్చేందుకు యత్నం
- డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు కొత్త డ్రామాలు

వలంటీర్ల వ్యవస్థ దండగ. టీడీపీ కార్యకర్తలు వలంటీర్ల లోపాలు ఎప్పటికప్పుడు గుర్తించి 7557557744 నంబర్‌కు వాట్సాప్ చేస్తే వారి కథ చూసుకుంటాం. లోపాలు గుర్తించి చెప్పిన వారికి రూ. 10వేల పారితోషికం ఇస్తాం.

- 2021మార్చి 30న తిరుపతిలో జరిగిన టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో అచ్చెన్న చేసిన వ్యాఖ్యలివి.

ఒక్కపైసా తీసుకోని వాళ్లని వలంటీర్లు అంటారు. డబ్బులు తీసుకుని పనిచేసే వాళ్లను కార్యకర్తలు అంటారు.

- 2022 మే 7వ తేదీన అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలివి.



సచివాలయ వలంటీర్ల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల కార్యకలాపాల్లో వలంటీర్లు పాల్గొనకుండా చూసుకోవాలని అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించాలి.

- 2024 మార్చి 6న సీఈసీకి రాసిన లేఖలో అచ్చెన్నాయుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వలంటీర్ల వ్యవస్థను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చూస్తే వలంటీర్లపై ఎంత కక్ష కట్టారో అర్థమవుతుంది. ఈయనే కాదు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు తదితర టీడీపీ నాయకులంతా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్న వలంటీర్లపై అనేక సందర్భాల్లో విషం కక్కారు.

వృద్ధులు, వికలాంగులకు, వితంతువులపై టీడీపీ పగ పట్టేసింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి చేసే పింఛన్ల పంపిణీపై పచ్చ పార్టీ కుట్ర పన్నింది. వలంటీర్లు పింఛన్ల పంపిణీ యాగానికి విఘాతం కలిగించింది. అవ్వాతాతలకు అందుతున్న సేవలను చూసి ఓర్వలేకపోయింది. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని అక్కసు వెళ్లగక్కింది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉన్న వలంటీర్ల సేవలందకుండా అడ్డంకులు సృష్టించింది. ఫలితంగా పింఛనుదారులంతా సచివాలయానికి వెళ్లి మండుటెండల్లో.. గంటల పాటు వేచి ఉండి పింఛను తీసుకోవాల్సిన దుస్థితి తీసుకొచ్చింది. సచివాలయ వ్యవస్థలో అంతర్భాగమైన వలంటీర్ల నిస్వార్థ సేవలకు రాజకీయ రంగు పులిమి సేవా బంధాన్ని విచ్ఛిన్నం చేసింది. ఇన్ని చేసి టీడీపీ తిరిగి ఎదురుదాడి చేస్తోంది. తమకేమి తెలియదన్నట్టుగా, వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకం కాదని, పింఛన్లు ఇంటింటికీ అందకుండా చేసింది తాము కాదని, సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఆ ప్రక్రియ చేపట్టాలని మొసలి కన్నీరు కారుస్తోంది. చంద్రబాబు కుట్రలన్నీ ఇలాగే ఉంటాయని సాక్షాత్తు ప్రజలే వాపోతున్నారు. గాయం చేసి, మందు రాసినట్టుగా చంద్రబాబు తీరు ఉంది. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయనివ్వకూడదని, అలా చేసినట్టయితే వైఎస్ జగన్‌కు ప్రచారం చేసినట్టు అవుతుందని, రాజకీయ లబ్ధి చేకూరుతుందని తన జేబు సంస్థతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన చంద్రబాబు ఇప్పుడు యూటర్న్ నాటకాలు ఆడుతున్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన రావడం, టీడీపీపై వ్యతిరేకత పెల్లుబుకుతుండడంతో తనకేమి సంబంధం లేదన్నట్టుగా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవైపు వలంటీర్లను అనాల్సినవి అన్నీ అనేసి, లేనిపోని ఆరోపణలతో వ్యవస్థపై బురద జల్లేసి, ఆ వ్యవస్థకు తాము వ్యతిరేకం కాదని చెప్పుకోవడం చూస్తుంటే ఊసరవిల్లి రంగులు మార్చినట్టు చంద్రబాబు తన నడివడికను మార్చుకుంటున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామంటూ కుట్రలు పన్నిన చంద్రబాబును అవ్వాతాతలు, వికలాంగులు ఆక్షేపిస్తున్నారు.

ఉసురు తగులుతుంది



ప్రతి నెల ఇంటికి వలంటీర్ వచ్చి ఇచ్చే పింఛన్ సొమ్ము నేడు సచివాలయం వద్ద ఇస్తారని చెబుతున్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో కష్టాలు పడేవాళ్లం. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీ కార్యాలయానికి వెళ్లి తీసుకోవడం కష్టంగా ఉండేది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంటి వద్దకే తెల్లవారుజామున పింఛన్ ఇచ్చింది. చంద్రబాబు వల్ల ఎప్పుడూ కష్టాలే. టీడీపీ వారు చేసిన పనులకు మాలాంటి వారి ఉసురు తగులుతుంది.

- బొడ్డేపల్లి లక్ష్మణరావు, దివ్యాంగుడు, పొన్నాంపేట గ్రామం, ఆమదాలవలస మండలం

దుర్మార్గమైన చర్య

ప్రభుత్వం నాకు దివ్యాంగ పింఛన్ ఇస్తోంది. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే వలంటీర్ మా ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. ఈ నెల పింఛన్ ఇవ్వకపోవడంతో నాన్నను అడిగితే, సచివాలయాల్లో ఇస్తారని చెప్పారు. నాకు రెండు కాళ్లు పనిచేయవు, నడలేను. రెండు కిలోమీటర్లు వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే కష్టం. ఆటోలో కూడా వెళ్లలేని స్థితి. పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దకే పింఛన్ నగదు ఇవ్వడాన్ని చంద్రబాబు అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య.

- సిద్దబత్తుల హరిణి, దివ్యాంగురాలు, టీచర్స్‌కాలనీ, పాతపట్నం



నలుగురు తోడు రావాలి



వృద్ధాప్యంతో పాటు వచ్చిన అనారోగ్యం కారణంగా వ్యక్తిగత అవసరాలకు కూడా మరో మనిషి సాయం తీసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే నలుగురు మనుషులు నాకు తోడు రావాలి. ఇప్పటి వరకు ప్రతి నెల ఒకటో తేదీన వలంటీరు ఇంటికి తీసుకుని వచ్చి నిద్రలేవక ముందే పింఛన్ డబ్బులు ఇచ్చి వెళ్లిపోయేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి పింఛన్ డబ్బులు తీసుకోవాలని చెబుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల కారణంగా నాలాంటి ఎంతో మందికి అన్యాయం జరుగుతోంది.

- లావేటి త్రినాథులు, ఓఏపీ పింఛన్ లబ్దిదారుడు, యంబరాం, ఎల్.ఎన్.పేట

నేను నడవలేను

నాకు వందేళ్లు. నేను నడవలేను. లేచి నిలబడలేను. ప్రతి నెల వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఇప్పుడు అలాగే ఇవ్వాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. అతనికే నేను ఓటు వేస్తాను. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేస్తాను. పింఛను కోసం నేను ఎక్కడకీ వెళ్లలేను. ఇంటికి తెచ్చి ఇవ్వాలి.

- బొడ్డు అప్పారావు, వృద్ధుడు, బొడ్డపాడు, పలాస మండలం



ఐదు కిలోమీటర్లు వెళ్లాలి

వలంటీర్లు ప్రతి నెల ఫస్టు తేదీకి ఇంటికొచ్చి పింఛన్ ఇచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు సచివాలయాల్లో ఇస్తారని చెబుతున్నారు. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే పురుషోత్తపురం గ్రామం నుంచి చిన్నగుజ్జువాడకు ఈ ఎండల్లో 5 కిలోమీటర్ల దూరం వెళ్లాలి.

- జన్ని నీలయ్య, పురుషోత్తపురం గ్రామం, సారవకోట మండలం



క్లుప్తంగా

కిడ్నీ నుంచి 6 సెంటీమీటర్ల రాయి తొలగింపు



రోగి కిడ్నీ నుంచి తొలగించిన 6 సెంటీమీటర్ల రాయి

అరసవల్లి: నగరంలోని గ్లోబల్ న్యూరోకేర్ ఆస్పత్రి వైద్యులు బొడ్డేపల్లి యోగేష్ (యూరాలజిస్ట్), గొనప భవాని (అనస్థీషియాలజిస్ట్)ల ఆధ్వర్యంలో ఓ రోగి కిడ్నీ నుంచి ఏకంగా 6 సెంటీమీటర్ల రాయిని తొలిగించామని ఆస్పత్రి ఎండీ దేవిరెడ్డి గౌతమ్ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు. సాధారణంగా కిడ్నీలో 0.5 సెంటీమీటర్ల రాయి ఉంటేనే శస్త్రచికిత్సలు చేస్తామని, అలాంటిది అరుదుగా 6 సెంటీమీటర్ల రాయి ఉండడం గుర్తించి వెంటనే తొలిగించామని ప్రకటించారు. రోగి ఆరోగ్యంగానే ఉన్నారని ఎండీ తెలిపారు.

ఎన్నికల బరిలో కాంగ్రెస్

శ్రీకాకుళం అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అసెంబ్లీ నియోజకవర్గాల్లో శ్రీకాకుళంలో పైడి నాగభూషణరావు, ఆమదాలవలసలో సనపల అన్నాజీరావు, ఎచ్చెర్లలో కరిమజ్జి మల్లేశ్వరరావు, నరసన్నపేటలో మంత్రి నరసింహమూర్తి, పలసలో మజ్జి త్రినాథబాబు, పాతపట్నంలో కొప్పురోతు వెంకటరావు, ఇచ్ఛాపురంలో మాసుపత్రి చక్రవర్తి రెడ్డి పోటీ చేస్తారని పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. అలాగే శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పేడాడ పరమేశ్వరరావు, విజయనగరం పార్లమెంట్ అభ్యర్థిగా రమేష్ పోటీ చేస్తారని పేర్కొంది. టెక్కలి అభ్యర్థి పేరును ఇంకా ఖరారు చేయలేదు.

నాలుగు ఎకరాల జీడి మామిడి పంట దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గార: శ్రీకూర్మం పంచాయతీ నగరాలపేట, చుక్కపేట గ్రామాల పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో పలువురు రైతులకు చెందిన నాలుగు ఎకరాల పొలంలోని జీడి మామిడి, కొబ్బరి చెట్లు, మామిడి చెట్లు, సర్వే చెట్లు దగ్ధమయ్యాయి. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో ప్రమాదం చోటుచేసుకోవడంతో మంటలు ఎక్కువగా వ్యాపించాయి. స్థానికులు వెంటనే అధికారులకు సమాచారమివ్వడంతో తహసీల్దార్ ఎం.శ్రీను సంఘటన స్థలానికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక శాఖాధికారులకు ఫోన్ చేసి మంటలార్పించే ప్రయత్నాలు చేశారు. ఈ ఘటనలో చుక్కపేట, నగరాలపేటకు చెందిన పలువురు రైతులున్నారు. కొన్ని చెట్లు పూర్తిగా కాలిపోవడంతో నష్టం వచ్చిందని రైతులంటున్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై సీఎండీకి ఫిర్యాదు

టెక్కలి : టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ ఈశ్వరరావు మండలంలో అక్రమంగా విద్యుత్ స్తంభాలు మార్పిడి చేయడమే కాకుండా ఆయా వినియోగదారుల నుంచి లక్షలాది రూపాయలు అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్నారంటూ టెక్కలి పట్టణానికి చెందిన ఉర్జాన విశ్వనాథం సీఎండీకి ఫిర్యాదు చేశారు. విజిలెన్స్ అధికారుల ద్వారా దర్యాప్తు నిర్వహిస్తే తగిన ఆధారాలు ఇస్తానని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీ యూకేటీ) ఎస్ఎంపురం క్యాంపస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్జీయూకేటీ విద్యార్థులు అత్యున్నత స్థాయిలో ఉంటున్నారని చెప్పారు. ఉన్నత విద్య, ఉద్యోగాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. ఇప్పటి నుంచే సివిల్స్, గ్రూప్స్, ఐఈఎస్ వంటి పోటీ పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. సాంకేతిక, పారిశ్రామిక అంశాలపై పట్టు సాధించాలన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన, ఉత్తమ మానవ వనరులు సాధ్యమని వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డైరెక్టర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా..హుషారుగా..!

గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తమను గెలిపించాలంటూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సంక్షేమ ప్రభుత్వానికే మళ్లీ పట్టం కట్టాలని కోరుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: ప్రచారానికి విచ్చేసిన మంత్రి ధర్మాన ప్రసాదరావుకు తిలకం దిద్దుతున్న మహిళ



నరసన్నపేట: రెల్లివలసలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: పాతపట్నం ఎస్సీవీధిలో ఎన్నికల ప్రచారంలో చిన్నారిని ఎత్తుకున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎచ్చెర్ల: లావేరు మండలం తాళ్లవలసలో ప్రచారం చేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఆమదాలవలస: 13వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సోంపేట: జింకిభద్రలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎంపీపీ నిమ్మన దాస్



టెక్కలి: ఆది ఆంధ్రా వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్

పీజీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

- అంబేడ్కర్ వర్సిటీలో 16 పీజీ కోర్సులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తులు స్వీకరణకు చివరి తేదీ మే 4

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్ర వ్యాప్త విశ్వవిద్యాలయాలు యూనిట్‌గా పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏపీ పీజీసెట్ –2024 విడుదలైంది. ఈ పరీక్ష ద్వారా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 16 పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ, ఇంగ్లిష్, ఎంఈడీ, ఎంఎస్‌డబ్ల్యూ, తెలుగు, ఎంజేఎంసీ, మ్యాథ్స్, అప్లెడ్ మ్యాథ్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, అనలాటికల్ కెమిస్ట్రీ, బయో టెక్నాలజీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలతో పాటు జిల్లాలో మరో నాలుగు ప్రైవేట్ కళాశాలల్లో సైతం పీజీ కోర్సులు నిర్వహిస్తున్నారు.

పీజీ సెట్ ఫీజు పరిశీలిస్తే ఓసీలకు రూ.850, బీసీలకు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.650గా నిర్ణయించారు. మే 5 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుంది. రూ.500 అదనపు రుసుంతో మే 15 వరకు, రూ.1000 అదనపు రుసుంతో మే 25 వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మే 27 నుంచి 29 వరకు మార్పులు–చేర్పులు, మే 31 నుంచి హాల్ టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం కల్పించారు. జూన్ 10 నుంచి 14 వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. పూర్తి వివరాలను వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్: //సీఈటీఎస్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌లో పొందుపర్చారు.

జాతి అభివృద్ధిలో కుల సంఘాల పాత్ర కీలకం

- తూర్పుకాపుల ఆత్మీయ సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఆత్మీయ సభలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కుల సంఘాలు జాతి అభివృద్ధికి కృషి చేస్తాయే తప్ప ఎటువంటి స్వలాభాల కోసం కాదని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. తూర్పుకాపుల సంక్షేమ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 50 సెంట్లు స్థలాన్ని కేటాయించడంలో కృషి చేసిన మంత్రి ధర్మానను శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగాన మంత్రి మాట్లాడుతూ తన రాజకీయ ప్రయాణంలో తూర్పుకాపుల సహకారం మరువలేనిదన్నారు. తూర్పుకాపులకు తాను చేసింది సాయం కాదని, బాధ్యతని పేర్కొన్నారు. చిన్న చిన్న కులాలు సైతం సమాజంలో నిరాశ నిస్పృహలకు గురికాకుండా ప్రోత్సహించాలన్నదే తన లక్ష్యమన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశాలభావజాలంతో నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీటిని చూడలేని కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాపులకు ఎలాంటి సాయం కావాలన్నా స్పందిస్తానన్నారు. విద్యా విధానంలో సంస్కరణలను ఉపాధ్యాయులు స్వీకరించాలే తప్ప వ్యతిరేకించకూడదన్నారు. భావితరాల కోసమే సమూల మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, వావిలాపల్లి జగన్నాథంనాయుడు, కొండాల గణేష్, గేదెల వాసుదేవరావు, ఇజ్జాడ శివన్నారాయణ, కద్దాల శ్యామ్, శాసపు జోగినాయుడు, కొమ్ము రమణమూర్తి, లుకలాపు గోవిందరావు, ఆబోతుల రామ్మోహన్ రావు, గేదెల చిరంజీవరావు, రౌతు సూర్యనారాయణ, కర్నేన పద్మ తదితరులు పాల్గొన్నారు.

జెమ్స్‌కు అరుదైన గుర్తింపు

- 'రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్' అక్రిడేషన్ లభించిన తొలి వైద్య కళాశాలగా రికార్డు



అవార్డు స్వీకరిస్తున్న చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు

శ్రీకాకుళం రూరల్: జిల్లాలోని రాగోలులో జెమ్స్ ఆసుపత్రి అరుదైన గుర్తింపు సాధించింది. శస్త్ర చికిత్స, వైద్య కళాశాలల్లో రెండు దశాబ్దాల చరిత్ర కలిగి ప్రపంచంలోనే పేరొందిన లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇంగ్లాండ్ కళాశాల నుంచి అక్రిడేషన్ లభించిందని జెమ్స్ కళాశాల యాజమాన్యం, ఆంకాలజిస్ట్ పద్మశ్రీ డాక్టర్ రఘురామ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా చీఫ్ మెంటార్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ తమ కళాశాలకు ఈ గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాది రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్ బృందం తమ కళాశాలను సందర్శించి ఇక్కడి బోధన, వైద్య సదుపాయాలతో పాటు ఆపరేషన్ థియేటర్లను పరిశీలించి ఈ గుర్తింపునిచ్చిందని పేర్కొన్నారు. భారతదేశంలో ఏ వైద్య కళాశాలకు ఈ గుర్తింపు రాలేదన్నారు. కార్యక్రమంలో జెమ్స్ కళాశాల సీఈఓ ఆద్విక్, సీఏఓ రామ్మోహన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, మెడికల్ సూపరింటెండెంట్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల అందజేత

- రూ. 55 లక్షల విలువైన 446 ఫోన్లు రికవరీ



మొబైల్స్‌ను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : వేర్వేరు చోట్ల పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు ఎస్పీ జీఆర్ రాధిక చేతులమీదుగా మంగళవారం అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో 56 ఫోన్లను డీఓటీ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్) సిఈఈఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) సిఇఐఆర్.జిఒవి.ఐఎన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న బాధితులకు ఎస్పీ ఈ మొబైళ్లను అందించారు. ఇదివరకు 2022 అక్టోబరులో 130 మొబైళ్లను ఒకసారి, 2023లో 114 మొబైళ్లను (మొత్తంగా 244) లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ యాప్ ద్వారా ట్రేస్ చేసి బాధితులకు ఇచ్చారు. దాని డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌గా మరో మారు సీఈఈఆర్ పోర్టల్ ద్వారా మరో 144 ఫోన్లను ఇచ్చారు. మంగళవారంతో కలిపి ఇప్పటివరకు జిల్లాలో రూ. 55 లక్షల విలువైన 446 ఫోన్లను బాధితులకు ఇప్పటివరకు అందాయి.

సిఇఈఆర్‌లో రిజిస్టర్ చేసుకోవడమిలా..

ఎవరిదైనా మొబల్ ఫోన్ పోతే ముందుగా సిఇఐఆర్ వెబ్‌సైట్‌లో బ్లాకింగ్ రిక్వెస్‌ను రిజిస్టర్ చేసుకోవాలి. మొబైల్ ఐఎంఈఐ నంబర్లు బ్లాక్ అయ్యాక రిక్వెస్ట్‌ను జిల్లా సైబర్ సెల్ పోలీసులు రిసీవ్ చేసుకుని మొబైల్‌ను ట్రాక్ చేసి రికవరీ చేసుకుంటారు. మొబైల్‌ను అన్‌బ్లాక్ చేసి తిరిగి పోగొట్టుకున్న వ్యక్తికి ఇస్తారు. దీనిపై ఎస్పీ మాట్లాడుతూ మొబైల్స్ వాడేవారు తప్పనిసరిగా సెక్యూరిటీ లాక్ ఉపయోగించాలని, వ్యక్తిగత, విలువైన సమాచారాన్ని మొబైల్స్‌లో ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. విలువైన మొబైల్ ఫోన్లను బాధితులకు అందించడంలో కృషి చేసిన సైబర్ సెల్ సీఐ టి.శ్రీను, సిబ్బంది పైలా శరత్‌చంద్ర, గిరి, సుధీర్, సత్యనారాయణ, అరవింద్ తదితరులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, సీఐలు శ్రీనివాస్, జి.సోమశేఖర్‌లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై ఫిర్యాదు

కంచిలి: భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నారని కంచిలి మండలం అరవ సరియాపల్లి గ్రామానికి చెందిన బుద్దెపు కృష్ణవేణి కంచిలి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. తనకు 2022 ఫిబ్రవరి 4న కామేష్‌తో వివాహమైందని, పెళ్లయిన 3 నెలల నుంచి భర్తతోపాటు మామ రామయ్య, అత్త రాములమ్మ, ఆడపడుచు నిర్మల, వరుసకు మరిది ప్రసాద్‌లు శారీరకంగా, మానసికంగా వేధిస్తూ అదనంగా రూ.1,50,000 వరకట్నం తీసుకురావాలని వేధిస్తున్నారని, ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కంప్యూటర్ అకౌంటెన్సీ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 45 మధ్య వయస్సు ఉన్న యువకులు అర్హులు కాగా, ఈ నెల 10 నుంచి బ్యాచ్ ప్రారంభిస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు 9553410809, 799 3340407 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: నిరుద్యోగ యువతీయువకుల కోసం పైప్ ఫిట్టర్, ఇండస్ట్రియల్ వెల్డర్ వృత్తి విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు లెర్నెట్ స్కిల్స్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లమో విద్యార్హతను కలిగి 18 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సుగల యువతీయువకులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6304332796 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా హరిబాబు



వండాన హరిబాబు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా తపాలా శాఖ నూతన సూపరింటెండెంట్‌గా వండాన హరిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా తపాలాశాఖ కార్యాలయంలో హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో అనంతపురంలో తపాలా శాఖ సూపరింటెండెంట్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తపాలాశాఖ అభివృద్ధికి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. తపాలా శాఖ ద్వారా వివిధ రకాల పొదుపు పథకాలు, బీమా, ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సేవలను అందిస్తామని తెలిపారు.

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి..



సాబకోట పంచాయతీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన ఎస్సీ, ఎస్టీ యువత



వైఎస్సార్‌సీపీలో చేరిన నారాయణపురం పంచాయతీకి చెందిన టీడీపీ కార్యకర్తలు

మందస/కాశీబుగ్గ: మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గిరిజన ప్రాంతమైన సాబకోట పంచాయతీకి చెందిన నాగకృష్ణ, నవీన్, మహేశ్, బుద్ధ భైరి, కేదారి, నాగ హేమంత్, నీలంబార్, క్రియాన్, వెంకట్, వెంకటేశ్, రమేష్, గిరిధర్, మియా తదితర 30 కార్యకర్తలు మంది మాజీ సర్పంచ్ మద్దిల రామారావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. క్లస్టర్ ఇన్‌చార్జులు సవర నీలకంఠం, నాగేశ్వర బృందావన్, పార్టీ ఎస్టీ విభాగం జిల్లా కార్యదర్శి ఎం.డొంబురు, త్రినాథ్, శివాజీ, తిరుపతి, కోదండరావు ఉన్నారు. సిద్ధిగాం పంచాయతీ శ్రీరాంపురం గ్రామానికి చెందిన పి.మాధవరావు, కృష్ణారావు, మోహనరావు, ఈశ్వర్, బాలరాజు, మహేశ్, ప్రదీప్‌కుమార్, సుజా, కున్నమ్మ, ప్రకాశరావులతో పాటు మరో 20 మంది సర్పంచ్ గున్న రమణ ఆధ్వర్యంలో మంత్రి సీదిరి సమక్షంలో పార్టీలో చేరారు. పిందిరి విశ్వనాథం, తమిరియా శోభన్ బాబు పాల్గొన్నారు. నారాయణపురం పంచాయతీ చిన్నకేశుపురం, పెద్దకేశుపురం గ్రామాలకు చెందిన సొర్ర కామయ్య, దున్న మోహనరావు, గొరకల ఓకాథం, దున్న సూరమ్మ, సొర్ర అడివమ్మ, మడియా ఊర్వశి, రోహిణమ్మ, బాలమ్మ, శారద, దీప, గొరకల కేదారి, గంగమ్మ, కదంబాల శాంతమ్మ, మహలక్ష్మి తదితరులు చేరగా.. మంత్రి సాదరంగా ఆహ్వానించి కండువాలు వేశారు. సర్పంచ్ బత్తిని తేజేశ్వరరావు, గొరకల కేశవరావు, మడియా కోదండ, సోమేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి. చిత్రంలో ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

పాతపట్నం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌తో కలిసి మెళియాపుట్టి మండలానికి చెందిన బూత్ కమిటీ సభ్యులు, నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పేరాడ తిలక్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కుట్రపూరితమైన కూటమితో టీడీపీ, జనసేన, బీజేపీలు వస్తున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రజా బలంతో ఎన్నికలకు సిద్ధమవుతోందన్నారు. పేదల బతుకులు బాగుపడాలన్నా.. వారి జీవితంలో ఆర్థిక ప్రగతి కనిపించాలన్నా.. ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా చేరువ కావాలన్నా.. వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు రెడ్డి శ్రావణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు యోగి, నాయకులు సంజీవరావు, బైపోతు ఉదయ్, జయమునిరావు, బాబూరావు, శశిభూషణరావు, తేజేశ్వరరావు, దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రుణాల కలకలం!



నరసన్నపేటలోని బజారు స్టేట్‌బ్యాంకు శాఖ

నరసన్నపేట: మండల కేంద్రం నరసన్నపేటలోని బజారు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచిలో రుణాల కలకలం రేగింది. కొందరు సిబ్బంది ఉన్నతాధికారుల సహకారంతో కష్టమర్ల పేరిట రుణాలు వాడుకొని తిరిగి చెల్లించనట్లు సమాచారం. మూడు రోజులుగా బ్యాంకులో జరుగుతున్న అంతర్గత ఆడిట్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసినట్లు తెలిసింది. నకిలీ (ప్రభుత్వ ఉద్యోగుల) పేర్లతో బ్యాంకు సిబ్బంది రుణాలు రూ.3 కోట్లు వరకూ వాడుకొని గుట్టుచప్పుడు కాకుండా లావాదేవీలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎవరెవరి పేరిట ఈ రుణాలు వాడుకున్నారే విషయం బయట పడటంలేదు. తక్కువ వడ్డీకి బ్యాంకులో రుణాలు వస్తాయనే ఉద్దేశంతో బ్యాంకు సిబ్బంది కొందరు ప్రభుత్వ ఉద్యోగుల పేరున రుణాలు వాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్యాంకులో ఉన్న ఖాతాదారులైన ప్రభుత్వ ఉద్యోగులు తమకు పర్సనల్ లోన్లు కావాలని, ఎడ్యుకేషన్ రుణాలు కావాలని దరఖాస్తులు చేస్తుంటారు. అందులో కొందరికి రుణాలు మంజూరవుతాయి. మరికొందరికి రుణాలు మంజూరు కావు. ఇటువంటి వారి పేర్లను బ్యాంకు ఉద్యోగులు తమకు అనుకూలంగా మలుచుకొని వారి పేరిట రుణాలు వాడుకొని వాయిదాలు చెల్లిస్తున్నట్లు సమాచారం. గత కొంత కాలంగా ఈ విధంగా వాడుకున్న రుణ వాయిదాలు బ్యాంకు సిబ్బంది చెల్లించకపోవడంతో ఆడిట్‌లో బయట పడినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఖాతాదారులకు ఎటువంటి నష్టం జరగకపోయినా బ్యాంకు సిబ్బంది ఇతరుల పేరున తప్పుడు లావాదేవీలు చేయడం నేరమే అవుతుందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ విధంగా ఎవరెవరి పేరున ఏ బ్యాంకు ఉద్యోగులు రుణాలు వాడుకున్నారో అనేది తేలాల్సి ఉంది. మంగళవారం సాయంత్రం 7 గంటల వరకూ బ్యాంకు సిబ్బంది పరిశీలన చేశారు. ఈ విషయమై బ్రాంచి మేనేజర్ శ్రీకర్ వద్ద ప్రస్తావించగా ఈ బ్యాంకులో ఎటువంటి రుణాల గందరగోళం జరగలేదని, ప్రతీ నెలా జరుగుతున్నట్లుగానే ఆడిట్ జరిగిందని తెలిపారు. ఈ ఆడిట్‌కు అంత ప్రాధాన్యత లేదని స్పష్టం చేశారు.